ప్రజాశక్తి

బుధవారం 31 జనవరి 2024 5 శ్రీ సత్యసాయి





సబ్‌కలెక్టర్ కార్యాలయంలో బైటాయించి నిరసన తెలుపుతున్న పేదలు

మాట తప్పం.. మడమ తిప్పం..!



◆ ఇంటింటికీ వాలంటీర్లతో ప్రచారం
◆ అనుకూల సోషల్ మీడియా కూడా
◆ అధికార వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికలు సమీస్తుండటంతో అధికార వైసిపి ప్రచారాన్ని ముమ్మరం చేస్తోంది. సభల రూపంలో పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తుండగా మరోవైపు సైలెంట్‌గా ఇంటింటి ప్రచారానికి తెరలేపింది. వాలంటీర్లు, సోషియల్ మీడియాతోపాటు వివిధ సంక్షేమ పథకాల పేరుతో సేకరించిన సమాచారంతోనూ మొబైల్ ఫోన్ల ద్వారానూ ప్రతి ఓటరును చేరుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్టు సమాచారం. ఇటువంటి కార్యక్రమాన్ని ఇంటింటికీ చేపట్టే పనిలో ఇప్పటికే నిమగ్నమై ఉంది. 'మాట తప్పం..మడమ తిప్పం.' అన్న నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు వాలంటీర్లు, సోషియల్ మీడియాను జత కలిపి ప్రజల వద్దకు పంపించే ప్రయత్నాన్ని అధికార వైసిపి చేపడుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటికే ఈ రకమైన ప్రచారాన్ని మొదలు పెట్టింది. సత్యసాయి జిల్లాలో మంగళవారం నాడు ప్రయోగాత్మకంగా ఒక మండలంలో ఇటువంటి ప్రచారాన్ని, సర్వేను చేపట్టినట్టు సమాచారం. వాలంటీరు పరిధిలోని ఇంటింటికెళ్లి వివరాలు సేకరించే పనిని చేడుతున్నారు. అదే సమయంలో వారు ప్రభుత్వం పాలన పట్ల ఏ రకంగా ఉన్నారన్న అంచనాలను



రూపొందిస్తున్నారు. ప్రభుత్వం ద్వారా ఏ రకమైన లబ్ధి చేకూరిందన్నది వాలంటీరు ద్వారా సేకరించిన సమాచారాన్ని ఆయా కుటుంబాలకు తెలియజేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి రాకపోతే సచివాలయ వ్యవస్థ ఉండకపోతే నాయకుల ఇళ్ల వద్దకు తిరగాల్సి రావొచ్చు అంటూ ఓటర్లను ఆలోచనలో పడేసే కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు సమాచారం. వైసిపి మరోమారు అధికారంలోకి వస్తే 'మాట తప్పదు..మడమ తిప్పదు.' అన్న నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళుతోంది. ఇలా సైలెంట్‌గా వైసిపి ఎన్నికల ప్రచారాన్ని చేపడుతోంది. దీనికి వాలంటీర్లను వినియోగించుకుని ప్రచారం చేపట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విధంగా బుధవారం నాడు మరో మండలంలో ఈ రకమైన ప్రచారాన్ని నిర్వహించనుంది. వైసిపి ఇప్పటికే నేతల ద్వారా ప్రచారాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసింది. గడిచిన రెండేళ్లుగా గడపగడపకూ కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రభుత్వ పథకాలు ఏ ఇంటికి ఎన్ని పథకాలు అందాయన్న విషయాన్ని కరపత్రాల రూపంలో వివరంగా తెలియజేశారు. ఈ సమయంలో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. ఇప్పుడు ఎన్నికలు సమీస్తుండటంతో ప్రచారాన్ని మరింత ముమ్మరం చేస్తోంది. నేతలు, వాలంటీర్లు అందరినీ సమిష్టిగా బరిలోకి దింపుతోంది. వీరు కాకుండా గృహ రథ సారథులను నియమించారు. వాలంటీర్లకు ఇద్దరు చొప్పున నియమించారు. ఎన్నికల సమయంలో ప్రచారానికి వాలంటీర్ల ద్వారా నిర్వహించడం ఇబ్బందయితే గృహ రథసారథుల ద్వారా ప్రచారాన్ని నిర్వహించాలని తలపెట్టారు. మొబైల్ ఫోన్లకు నేరుగా ముఖ్యమంత్రి సందేశాలతోపాటు, కార్యక్రమాల వివరాలు ప్రతి ఓటరు చేరుతున్నాయి. సైలెంట్ ప్రచారాలు ఈ విధంగా ఉంటే భారీ బహిరంగ సభలనూ మరోవైపు నిర్వహిస్తోంది. ఫిబ్రవరి 11వ తేదీన ఉమ్మడి అనంతపురం జిల్లాలో రాయలసీమ స్థాయి సభను 'సిద్ధం' పేరుతో చేపట్టనుంది. దీనికి సంబంధించి పెద్దఎద్ద పోస్టర్లు వెలుస్తున్నాయి. ఈ సభకు లక్షల సంఖ్యలో జనసమీకరణ చేపట్టాలని భావిస్తోంది. ఇందుకు ఏర్పాట్లు ఇప్పటికే మొదలయ్యాయి. రాయలసీమ జిల్లాల అన్నింటి నుంచి భారీగా జనసమీకరణ చేయనుంది. ఇలా అధికార వైసిపి గెలుపే లక్ష్యంగా అన్ని మార్గాల్లో ప్రచారాన్ని ముమ్మరం చేస్తోంది.

పేదలపై ఎందుకింత నిర్లక్ష్యం.?

◆ అందరికీ ఇళ్ల పట్టాలివ్వాలి
◆ సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్
◆ సబ్ కలెక్టర్ కార్యాలయంలో బైటాయించి నిరసన

ప్రజాశక్తి -పెనుకొండ

పెనుకొండ పట్టణంలో ఇళ్ల పట్టాలు లేని పేదలు ఏళ్ల తరబడి వినతిపత్రాలు అందిస్తున్నా సమస్యను పరిష్కరించకుండా అధికారులు ఎందికింత నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ ప్రశ్నించారు. ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ పట్టణంలో ఇళ్లు లేని నిరుపేదలు వ్యకాసం ఆధ్వర్యంలో మంగళవారం నాడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఏవో ఛాంబర్‌లో బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలందరికీ పట్టాలివ్వాలని హైకోర్టు తీర్పు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పేదలు అనేక సార్లు అధికారులకు వినతులు అందించినా వారి నుంచి ఎలాంటి స్పందనా లేదన్నారు. పట్టణంలో సొంత ఇళ్లు లేక పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వీరి సమస్యలను అధికారులు గుర్తించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ పేదల ఇళ్ల స్థలాల సమస్యపై సబ్‌కలెక్టర్ మాట్లాడేందుకు రమ్మని చెప్పి కార్యాలయంలో లేకుండా క్యాంపునకు వెళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పేదల ఇళ్ల పట్టాల సమస్యను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాల విషయంపై అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో తామే ప్రభుత్వ స్థలంలో పేదలతో గుడిసెలు వేయిస్తామని చెప్పి నాయకులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటరాముడు, తిప్పన్న, పట్టణ వ్యవసాయ కార్మిక మహిళ నాయకులు జయంతి, మనీ, దివ్యభారతితో పాటు పేదలు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణబాబు

ఓటర్లకు అనువుగా పోలింగ్ కేంద్రాలు

కలెక్టర్ పి.అరుణబాబు

ప్రజాశక్తి-లేపాక్షి, గోరంట్ల రూరల్

ఆయా ప్రాంతాల్లో ఓటర్లకు అనువుగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో లేపాక్షి, గోరంట్ల పట్టణాల్లో వివిధ పాఠశాలల్లో పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల కోసం స్థలాల ఏర్పాట్లను కలెక్టర్ మంగళవారం నాడు పరిశీలించారు. జిల్లాలో 6 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాలు, రిసెప్షన్ కేంద్రాలు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలి.. ఎన్ని రూమ్‌లు అవసరం అవుతాయి.. తదితర వివరాలను సంబంధిత అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం కొత్త మాన్యువల్‌ను అనుసరించి ఎలాంటి ఏర్పాట్లు చేపట్టాలన్న అంశాలపై అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. ఏ ఒక్క ఓటరు కూడా పోలింగ్ కేంద్రానికి చేరుకునేందుకు రెండు కిలోమీటర్ల కంటే ఎక్కువ నడవరాదన్న ఉద్ధేశంతో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి కార్యచరణ ప్రణాళికలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్డీవోలు భాగ్యరేఖ, వంశీకష్ణ, రమేష్ రెడ్డి, లేపాక్షి తహశీల్దార్ బాబు, గోరంట్ల తహశీల్దార్ రంగనాయకులు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్లు పాల్గొన్నారు.



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

సెర్ప్ ఉద్యోగుల వినూత్న నిరసన

పుట్టపర్తి రూరల్ : డిఆర్‌డిఎ, వైఎస్ఆర్ క్రాంతి పథకం ఉద్యోగులు తమ డిమాండ్ల సాధనకోసం డిఆర్‌డిఎ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న నిరసన మంగళవారం కొనసాగించారు. ఈ సందర్భంగా కళ్లకు నల్ల రిబ్బన్ కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆనిమేటర్లు, మండల సమాఖ్య అకౌంట్ సెక్షన్ లో పని చేసే ఉద్యోగులు, వీరికి మద్దతు తెలుపుతూ శిబిరంలో బైటాయించారు. మంగళవారం రోజున నిరవధిక నిరాహార దీక్షలో రాధమ్మ, లక్ష్మీనారాయణ, శ్రీరాం నాయక్, అంజినప్ప, కిష్టప్ప కూర్చున్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. .ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు రామేశ్వర్ రెడ్డి, గోపాల్, రామమోహన్, రమణప్ప, శంకర్, సుధాకర్, ఆనిమేటర్లు, గోరంట్ల సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురు చేరిక

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని త్యాగరాజునగర్, కోట శాంతినగర్‌కు చెందిన పలువురు ఆర్‌టిఐ అధ్యక్షులు సుహేబ్ ఖాన్ ఆధ్వర్యంలో మంగళవారం పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరిని పార్టీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ మనోహర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన రేష్మ, యాసీన్ ఖాన్, సికందర్, సాధికా, దాడాపీర్‌తో పాటు ఏ బ్లాక్ ప్రెసిడెంట్ అమానుల్లా, టౌన్ ప్రెసిడెంట్ జమీల్, జిల్లా మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ఫయాజ్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ మహబూబ్ బాషా, ఒబిసి జిల్లా ప్రెసిడెంట్ తిరుపాల్, బి బ్లాక్ ప్రెసిడెంట్ రామాంజనేయులు, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీక్, టౌన్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ పేరిస్వామి, ఎమ్‌డి అలీ, ముబారక్, ఖాజాహుసేన్ తదితరులు పాల్గొన్నారు.

కురుబలు రాజకీయంగా చైతన్యం కావాలి

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

కురుబలు రాజకీయంగా ఎదగడానికి చైతన్యవంతులు కావాలని కురుబ సంఘం తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బిల్లే మంజునాథ్ పేర్కొన్నారు. మంగళవారం సాయి ఆరామంలో జిల్లాస్థాయి కురుబ సంఘం జిల్లా స్థాయి నాయకులు సమావేశమయ్యారు. జిల్లా అధ్యక్షులు సామకోటి ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంజునాథ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో కురుబలకు అవకాశం కల్పించే పార్టీలకు కురుబలు మద్దతు ఇస్తారన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలు ఈ విషయాన్ని గమనించి జనాభా ప్రాతిపదికన కురుబలకు రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు అసెంబ్లీ స్థానాలు, రెండు ఎంపీ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె. రత్నాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు శివానంద, ఉపాధ్యక్షులు కేశాని ఆదినారాయణ, కోశాధికారి బన్యాల రమేష్, ఉపాధ్యక్షులు కమ్మన్న, కార్యదర్శి నాగరాజు, రాప్తాడు అసెంబ్లీ ఇన్‌ఛార్జి పాల్యం కాటమయ్య, గుంతకల్లు రైల్వే డివిజన్ బోర్డు సభ్యులు దివాకర్, పెనుకొండ బాలు పాల్గొన్నారు.

టిడిపిలో 30 కుటుంబాలు చేరిక

ధర్మవరం టౌన్ : పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం నాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పట్టుచీరల వర్క్స్ అసోయేషన్ సభ్యులు 30 కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు పట్టుచీరల వర్క్స్ వత్తిదారులు సమస్యలను పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ధర్మవరంలో ఉన్న ప్రతి పట్టుచీర వర్క్స్ సభ్యునికి ప్రత్యేక చేనేత హ్యాండ్లూమ్ గుర్తింపుకార్డులను ఇచ్చి ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి చేనేత పథకానికి అర్హులుగా గుర్తిస్తామన్నారు. ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డుతో పాటు ఇంటిస్థలం, ఇళ్లు కట్టించే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అభివృద్ధి చేయకపోతే వార్డుల్లో తిరగలేం..

◆ కౌన్సిల్‌లో అధికార పార్టీ కౌన్సిలర్లు ఆందోళన ◆ అవినీతిని ప్రశ్నిస్తారనే సమావేశాలు వాయిదా : టిడిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి-హిందూపురం

'పురపాలక సంఘం ఏర్పడి మూడేళ్ల గడుస్తున్నప్పటికీ వార్డుల్లో కనీన అభివద్ధి సైతం చేపట్ట లేదు. వార్డు వర్యటనకు వెళ్తే ప్రజలు నిలదీస్తున్నారు. అభివద్ధి చేయక పోతే ఇక వార్డుల్లో అడుగు పెట్టే పరిస్థితి లేదు'... అంటూ అధికార పార్టీ కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ముగళవారం నాడు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన కౌన్సిల్ సాధరణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 15 అంశాల్లో కూడిన అజెండాను కౌన్సిల్ దష్టికి తీసుకొచ్చారు. ఇటీవల మతి చెందిన మాజీ కౌన్సిలర్, రోడ్డు ప్రమాదంలో మతి చెందిన సచివాలయ సెక్రటరీలకు నివాళులు అర్పించారు. అనంతరం అజెండాపై చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఇర్షాద్, నాసిరబాను, అసిఫ్, రహమత్ బి, నాగేంద్రమ్మ అభివద్ధి విషయంలో ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. తమ వార్డుల్లో కౌన్సిల్ ఆమోదం తెలిపినప్పటికీ ఏమాత్రం అభివద్ధి పనులు జరగడం లేదన్న విషయాన్ని చాలాసార్లు కౌన్సిల్, అధికారుల దష్టికి తీసుకొచ్చిన ఫలితం లేదన్నారు. వెంటనే సంభందిత గుత్తేదారులతో చర్చించి పనులను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఛైర్‌పర్సన్ పోడియం ముందు బైఠాయించారు. ఇదే



ఛైర్‌పర్సన్ పోడియం ముందు బైఠాయించిన అధికార పార్టీ కౌన్సిలర్లు

సమయంలో ప్రతిపక్ష కౌన్సిలర్లు పలు సమస్యలపై నిలదీశారు. ఇరు పార్టీ కౌన్సిలర్లకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ నచ్చ చెప్పడానికి ప్రయత్నించినప్పటికీ, వారు వినకపోవడంతో సమావేశాన్ని ఐదు నిమిషాల పాటు వాయిదా వేశారు. అనంతరం సభ ప్రారంభం అయింది. అజెండాపై చర్చించాల్సిన అధికార పార్టీ కౌన్సిలర్లు అజెండాలో ఉన్న అన్ని అంశాల పైనా డీసెంట్ తెలుపుతూ ఛైర్‌పర్సన్ ఇంద్రజకు లిఖితపూర్వకంగా లేఖ ఇచ్చారు. దీంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఛైర్‌పర్సన్ ప్రకటించారు. ఈ సందర్భంగా అధికార పార్టీ కౌన్సిలర్లు మాట్లాడుతూ తాము వార్డు కౌన్సిలర్లుగా ఎంపిక అయినప్పటి నుంచి ఇప్పటి వరకు కనీస అభివృద్ధి పనులు సైతం వార్డుల్లో చేపట్టలేదన్నారు. తమ వార్డుల్లో పరిస్థితి ఇలా ఉంటే 35వ వార్డులో మాత్రం కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేశారన్నారు. కొంతమంది కౌన్సిలర్ల వార్డుల్లో మాత్రమే అభివద్ధి పనులు చేయడం సరికాదన్నారు. ప్రతిపక్ష కౌన్సిల్ నేత రమేష్ కుమార్, టిడిపి కౌన్సిలర్లు మాట్లాడుతు అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు వారు చేస్తున్న అవినీతి ఎక్కడ బయట పడుతుందోనని భయపడి ప్రతి సమావేశంలోనూ అల్లర్లను సష్టించి సమావేశాలు వాయిదా పడే విధంగా చేస్తున్నారన్నారు. పురపాలక సంఘ ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన కూరగాయల మార్కెట్ అధికార పార్టీ కౌన్సిలర్లకు అవినీతి సామ్రాజ్యం అన్నారు. ప్రవేట్ బస్టాండ్ లో కొంత స్థలాన్ని ఎటువంటి అనుమతులు లేకుండా కూరగాయల టోకు వ్యాపారులకు కేటాయించారు. వీటిపై ప్రతిపక్ష కౌన్సిలర్లు ప్రశ్నిస్తారని భయపడి అజెండాపై, ఆగిన అభివద్ధి పనుల పైన చర్చించకుండానే సమావేశానికి వచ్చినట్టు సంతకాలు పెట్టేసి వెళ్తున్నారన్నారు. పాలన చేతకాకపోతే దిగిపోవాలని అధికార పార్టీ పాలకవర్గంకు సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బిజెపి మరోసారి అధికారంలోకి వస్తే దేశానికి ముప్పు

సిడబ్ల్యూసి మెంబర్ రఘువీరారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

ప్రజాశక్తి మడకశిర

కేంద్రంలో మరోసారి బిజెపి అధికారంలోకి వస్తే దేశం అథోగతి పాలవుతోందని సిడబ్ల్యూసి మెంబర్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని నీలకంఠ కోల్డ్ స్టోరేజ్ లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశాన్ని మండల కన్వీనర్ మంజునాథ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రఘువీరారెడ్డి మాట్లాడుతూ 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో రూ. 47 లక్షల కోట్లు అప్పు చేస్తే పదేళ్ల బిజెపి పాలనలో రూ. 116 లక్షల కోట్లు అప్పు చేశారని విమర్శించారు. ఏం అభివృద్ధి చేశారని ఇంత అప్పు చేశారని ఆయన ప్రశ్నించారు. ఇతరులతో పిసిసి అధ్యక్షురాలు షర్మిలను తిట్టించడం ఏమాత్రం భావ్యం కాదన్నారు. ఫిబ్రవరి 5వ తేదీన మడకశిరలో నిర్వహించే బహిరంగసభకు పిసిసి అధ్యక్షురాలు షర్మిల పాల్గొంటుందన్నారు. ఈ సభకు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీగా తరలిరావాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో మడకశిర కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుధాకర్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్లు ప్రభాకర్ రెడ్డి, నరసింహమూర్తి, కన్వీనర్లు బాబు, గౌడప్ప, లోకేష్, గురుమూర్తి, నాగరాజు, బి బ్లాక్ అధ్యక్షులు త్యాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు బయపరెడ్డి, రాజు, సర్పంచులు శంకర్ రెడ్డి, డాక్టర్ రవి శంకర్, మాజీ కో ఆప్షన్ మెంబర్ మల్లికార్జున, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రంగారెడ్డి, దొడ్డయ్య నియోజకవర్గంలోని నాయకులు పాల్గొన్నారు.

జగన్‌తోనే నా ప్రయాణం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి మడకశిర రూరల్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితోనే చివరి వరకు తన ప్రయాణం ఉంటుందని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకు నామినేషన్ వేసే చివరి క్షణం వరకు టికెట్ కోసం ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంటానని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి స్పష్టం చేశారు. మంగళవారం నాడు ఆర్‌అండ్‌బి వసతి గహంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ కుటుంబంతో తనకు 40 సంవత్సరాలుగా అనుబంధం ఉందన్నారు. జగన్మోహన్‌రెడ్డి టికెట్ ఇచ్చినా.. ఇవ్వకపోయినా ఆయన వెంటే నడుస్తానని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కొందరుకావాలనే అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. కొందరు వైసిపిలో ఉంటూ టిడిపితో కుమ్మక్క రాజకీయాలు చేస్తున్నారన్నారు. తాను వైటీ ప్రభాకర్ రెడ్డితో అప్పు చేసిన మాట వాస్తవమేనని అయితే వడ్డీతో సహా మొత్తం చెల్లించానని చెప్పారు. కేసుల్లో ఉన్న వారు తనపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తాను ఎటువంటి పరిస్థితుల్లోనూ పార్టీని విడేది లేదన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఇళ్లస్థలాలు కేటాయించాలని దీక్షలు



నిరాహార దీక్షల్లో కార్మికులు, నాయకులు

ఓబుళదేవర చెరువు : మండలంలోని భవన నిర్మాణ కార్మికులకు ఇళ్లస్థలాలు, గృహాలు మంజూరు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శులు కుళ్లాయప్ప రమణ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షను చేపట్టారు. సిఐటియు నాయకులు మాట్లాడుతూ మండలంలోని భవన నిర్మాణ కార్మికులకు ఇళ్ల పట్టాలతో సహా గృహాలు నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఇళ్లస్థలాల కోసం గతంలో ఆందోళన కార్యక్రమాలు చేసినప్పటికీ అధికారులు స్పందించలేదని విమర్శించారు. సమస్య పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కిష్టప్ప, సహాయ కార్యదర్శి కేశవ, నాయకులు రమణ, సూరి ,రవి, శ్రీనివాసులు మహేష్, సురేంద్ర, చాంద్ బాషా కేశవ, అంజనప్ప, నాగరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్‌జి విద్యార్థినికి రాష్ట్రస్థాయి బహుమతి

ప్రజాశక్తి-హిందూపురం

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రతిష్టాత్మక కార్యక్రమం వీరగాథ 3.0 లో భాగంగా వ్యాసరచన విభాగంలో హిందూపురం రూరల్ మండలం కిరికెర లోని ఎల్ఆర్‌జి విద్యాలయం విద్యార్థిని జి.దీక్షిత రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతిని అందుకుంది. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో విద్యార్థిని దీక్షితను హెచ్‌ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో తమ పాఠశాల విద్యార్థిని ప్రథమ బహుమతి సాధించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రస్థాయిలో విజేతగా నిలిచిన దీక్షితను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇ.ప్రసాద్‌తో పాటు సెక్రటరీ బాలసుందరం, ఏవో సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

మహిళా కళాశాల ప్రిన్సిపల్ ప్రగతి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రతి మహిళ చదువును పూర్తి చేసుకుని ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా పారిశ్రామిక వేత్తలుగా ఎదగి, మరికొంత మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులకు నూతన ఆవిష్కరణలు, వ్యవస్థాపకతపై శిక్షణ, అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు అధ్యక్షతన వహించిన డాక్టర్ ప్రగతి మాట్లాడుతు విద్యార్థినులు పారిశ్రామికవేత్తలుగా తమ ప్రతిభను చాటుతూ, పలువురికి ఉపాధి కల్పించేదిశగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఇంకుబేషన్ మేనేజర్ డాక్టర్ చంద్రమౌళి, రిసోర్స్ పర్సన్స్ డాక్టర్ పి. జ్యోతి, డాక్టర్ బి. హసీనా, కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.వెంకటేశులు, సదస్సు కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీధర్, కామర్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

గోరంట్ల : పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయల జూనియర్, ఎస్‌వి డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతపై గుమ్మయగారిపల్లి, రాజీవ్ కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భక్తవత్సల విజయలక్ష్మి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులకు దూరంగా ఉండగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఒలు రఘునాథ్ రెడ్డి, ఆజాద్, బాల మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

కంది పంటకోత ప్రయోగాలు

ముదిగుబ్బ : కంది పంట కోత ప్రయోగాల పర్యవేక్షణ జిల్లా అర్థ గణాంక శాఖ అధికారి కె.విజయ కుమార్ మండలంలోని గుంజేపల్లిలో కంది పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఓబుళప్ప అనే రైతు పొలంలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపగణాంక అధికారి శ్రీనివాస్ నాయక్, మండల వ్యవసాయ అధికారి లక్ష్మీ నరసింహులు, చంద్ర శేఖర్, షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ రైట్స్ డే

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని బత్తలపల్లి ఎస్సీ, ఎస్టీ కాలనీలలో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం సివిల్ రైట్స్ డేను మంగళవారం నిర్వహించారు. పుట్టపర్తి డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డివిజనల్ స్థాయి ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాసులు నాయక్, పెడబల్లి తాండా, పవిత్ర, గోరంట్ల, పై పల్లి గంగాధర్ , రామాంజి నేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కాలనీవాసులు తమ సమస్యలను విన్నవించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ లక్ష్మి నారాయణ, కాలనీవాసులు తదితరులుపాల్గొన్నారు.

4 ఉచిత కంటి వైద్యశిబిరం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిబ్రవరి 4వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరమును నిర్వహిస్తున్నట్లు యువర్ ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి బండి నాగేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా వారు స్వాతి క్లినిక్‌లో కరపత్రాలను విడుదల చేశారు. ఈ కంటి వైద్య శిబిరం దాతలుగా గూండా నాగరాజు, సిద్ది రాజేష్ సిల్క్స్ ధర్మవరం వారు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ బి వి సుబ్బారావు, రమేష్ బాబు, పోలా ప్రభాకర్, వైకె శ్రీనివాసులు, బండ్లపల్లి రంగనాథం, చాంద్‌బాషా, నాగరాజు ఆచారి సత్రశాల మల్లికార్జున, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.


మహారాష్ట్రశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కదిరి
E.A. No. 57/2023 in E.P. No. 41/2018
O.S.No. 103/2017
Between:
బంగిస్ సూర్జహాన్ W/o బి.అల్లాబకష్ ఖాన్, D.No:7-329 జాకుషాఖ్లం వీధి, కదిరి, Now Residing at D.No:7-178, బ్రహ్మణ వీధి, పాతపూరు, అనంతపురం, అనంతపురం జిల్లా. ...పిటీషనర్/ డైక్రీహోల్డర్
మరియు
కె.రామకృష్ణ మరియు ఇతరులు
...డిక్రీహోల్డర్/ జడ్జిమెంట్ డెట్టర్
To
R2:బంగిస్ అల్లాబకష్ ఖాన్, S/o ఖాదర్ ఖాన్, D.No:7-329 జాకుషాఖ్లం వీధి, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా.
R2 కు నోటీసు
పై క్లైమ్ పిటీషన్లో పై కోర్టు వారు మీ పేరున నిర్ణయిస్తూ 14/02/2024 వ తేదీకి వాయిదా వేసినారు. కావున మీరు 14/02/2024 వ తేది ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు కావలయును. అట్లు హాజరు కాని పక్షములో పై అర్జీని మీ పరోక్షమున తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:14/02/2024
స్థలంకదిరి
ఎల్.వాసుదేవరెడ్డి, బి.ఎ.,ఎల్.ఎల్.బి.,
ఎల్.జ్ఞానవర్ధనరెడ్డి, బి.బి.ఎ.,ఎల్.ఎల్.బి.,
పిటీషనర్ తరుపు వకీళ్ళు, కదిరి.

CHANGE OF NAME
I, Syed Nabirool (Old Name) s/o syed Basha D.No 29-1-2,Kotnur Hindupur Mandal-515201 Sri Sathya Sai Dist.A.P Changing my Name from Syed Nabirool (oldname)To Syed Nabi Rasool (New Name) Hence forth I am being called as syed Nabi Rasool for all purpose

ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఆధునిక వ్యవసాయం దిశగా ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తున్నట్లు జిల్లా సూక్ష్మ నీటిపారుదల అధికారి (ఏపిఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్) సుదర్శన్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లాలోని పలు మండలాల్లో ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. పుట్టపర్తి మండల పరిధిలోని కర్ణాటక నాగేపల్లి , జగరాజుపల్లి, పట్నం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి రైతులు పండిస్తున్న ఉద్యానవన పంటలను, డ్రిప్పు స్ప్రింకర్ల వినియోగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు బిందు సేద్యం ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించారు. బుక్కపట్నం రైతు రవీందర్ రెడ్డికి చెందిన 2 ఎకరాల పొలంలో పండిస్తున్న మామిడి పంటను ప్రాజెక్ట్ డైరెక్టర్ పరిశీలించారు. ఇటీవల పుట్టపర్తి పోలీస్ పెరేడ్ గ్రౌండ్ మైదానంలో జరిగిన భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు చేతుల మీదుగా ఎంపికైన 30మంది రైతులకు డ్రిప్పు, స్ప్రింకర్లు ఇతర సామాగ్రిని సుమారు రూ. 50 లక్షల కు పైగా సబ్సిడీ రూపంలో పంపిణీ చేసిన నేపథ్యంలో రైతుల పొలాల్లో ఏర్పాటుచేసిన వివిధ రకాల పరికరాలను, యంత్రాలు రైతు పివిసి లైన్ తదితర వాటిని నేటి పర్యటన లో పలు చోట్ల తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.



డ్రిప్ ఇరిగేషన్‌ను పరిశీలిస్తున్న అధికారి

ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా రవికుమార్

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరం మున్సిపల్ నూతన కమిషనర్ గా టీఎస్ రవికుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ బండిశేషన్న తెనాలికి బదిలీపై వెళ్లారు. దీంతో మండపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్న కమిషనర్ టీఎస్ రవికుమార్ ధర్మవరం కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్లలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం చైర్మన్‌తో పట్టణ అభివృద్ధిపై చర్చించారు.



మున్సిపల్ చైర్‌పర్సన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నూతన కమిషనర్

'ఆడుదాం ఆంధ్ర' విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గస్థాయి పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి స్థానిక ఎమ్మెల్యే తనయుడు దుద్దుకుంట కిషన్ రెడ్డి రెడ్డి మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బహుమతులను అందజేశారు. బాల బాలికలకు నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, ఖోఖో, బ్యాట్మింటన్, కబడ్డీ పోటీలలో నియోజకవర్గంలోని ఆరు మండలాల నుండి విద్యార్థులు పోటీ పడ్డారు. క్రికెట్లో మొదటి బహుమతి నల్లమాడ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో కొత్తచెరువు అగ్రహారం జట్టు నిలిచాయి. ఈ కార్యక్రమంలో కోచ్‌లుగా వ్యవహరించిన పిఇటిలు వెంకటేష్, ప్రభాకర్, రామకృష్ణ, సూర్యనారాయణ, రమేష్, ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనకు చరమగీతం : పల్లె



పార్టీలోకి చేరిన వారికి కండువాలు కప్పుతున్న పల్లె

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

వైసిపి పాలనతో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారని దీంతో వచ్చే ఎన్నికలలో వైసీపీకి చరమ గీతం పాడడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం టిడిపి స్థానిక కార్యాలయంలో ఓడిసి మండలం నల్లగుట్లపల్లి గ్రామానికి చెందిన 11 వైసీపీ కుటుంబాలు పల్లె సమక్షంలో టిడిపిలో చేరారు. పార్టీలో చేరిన వారికి పల్లె టిడిపి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ ఈ నాలుగున్నర ఏళ్ల పాలనలో రాష్ట్రాన్ని 20 ఏళ్ల వెనక్కి తీసుకెళ్లిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలలో మార్పు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఎలాంటి జీవోలు లేకుండా నిధులు మంజూరు కాకుండానే ఎనిమిది వందల అరవై నాలుగు కోట్లు మంజూరు అయిందని డబ్బా కొట్టుకుంటూ ఇటీవల ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పాదయాత్ర చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2024 ఎన్నికలలో టిడిపి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

సుప్రీంకోర్టు తీర్పు జగన్‌కు చెంపపెట్టు : చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులను ఒక్కటైన జగన్ ప్రభుత్వం నిరూపించలేకపోయిందని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో సుప్రీంకోర్టులో ప్రభుత్వానికి ఎదురు దెబ్బ తగిలిందన్నారు. చంద్రబాబు ముందస్తు బెయిలు రద్దు చేయాలని, ప్రభుత్వం వేసిన పిటిషన్ ను సుప్రీంకోర్టు కొట్టి వేసిందని ఈ తీర్పు జగన్ కు చెంపపెట్టు లాంటిది అని అన్నారు.

ఎంవిఐకు ఉత్తమ సేవా పురస్కారం

ధర్మవరం టౌన్ : 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సత్యసాయి జిల్లా కదిరి మోటారు వాహన తనిఖీ అధికారి ఎంఎస్ వరప్రసాద్ ఉత్తమసేవా పురస్కారాన్ని కలెక్టర్, ఎస్పీ చేతులమీదుగా అందుకున్నారు. దీంతో మంగళవారం ధర్మవరం పట్టణంలోని బిస్మిల్లా డ్రైవింగ్ స్కూల్లో ఎంవిఐ వరప్రసాద్‌కు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. బిస్మిల్లా డ్రైవింగ్ స్కూల్ యజమాని బిస్మల్లా మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ఎంవిఐ వరప్రసాద్ చేపట్టిన విధానాలు అలాగే ప్రమాదాలను నివారించేందుకు వాహనదారులకు ప్రతి రోజు సూచనలు, సలహాలు అందిస్తూ విధులు నిర్వర్తించినందుకు ప్రభుత్వం గుర్తించి ఉత్తమ సేవా పురస్కారం అందించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిస్మిల్లా డ్రైవింగ్ స్కూల్ సభ్యులు శివ, వీరా, విజయ్‌కుమార్, పవన్, ఫరదీ, పణికుమార్ పాల్గొన్నారు.



ఎంవిఐ వరప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మచ్చలేని నాయకుడు చంద్రబాబు

కదిరి టౌన్ : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మచ్చలేని నాయకుడు అని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారం మదంతో ప్రతిపక్ష పార్టీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి పైశాచిక ఆనందం పొందుతోందన్నారు. ప్రభుత్వ తీరుపై కోర్టులు సైతం చివాట్లు పెట్టిన వారిలో మార్పు రాలేదన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమానికి పాటుపడే చంద్రబాబునాయుడిపై లేనిపోని ఆరోపణలు చేసి అక్రమ కేసుల్లో ఇరికించడాన్ని తెలుగు ప్రజలు అసహ్యించుకున్నారన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో వైకాపా ప్రభుత్వానికి ఎదురు దెబ్బ తగిలిందన్నారు. చంద్రబాబు ముందస్తు బెయిల్ ను రద్దు చేయాలని ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టి వేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఎప్పటికైనా నిజం గెలుస్తుందన్నది ముఖ్యమంత్రి జగన్ ఇప్పటికైనా అర్థం చేసుకోవాలని హితవు పలికారు.



మాట్లాడుతున్న కందికుంట

సుప్రీంకోర్టు తీర్పు జగన్ రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు : టిడిపి

ప్రజాశక్తి -పెనుకొండ

అధికార గర్వంతో జగన్ రెడ్డి అండ్ కో పెట్టిన కేసులు తప్పుడు కేసులు అని సుప్రీంకోర్టు తీర్పుతో వెల్లడైందని టీడీపీ జిల్లా ఈ విషయంలో సుప్రీం కోర్టు తీర్పు జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బికె. పార్థసారధి అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతిపక్ష నాయకుల మీద తప్పుడు కేసులు పెడుతూ ప్రజా ధనాన్ని జగన్ రెడ్డి ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందన్నారు. జగన్ రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా సరే రాష్ట్ర ప్రజలు చంద్రబాబు నాయుడు వెంటే ఉన్నారన్నారు. సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలకు జగన్ రెడ్డి, వైసీపీ నాయకులు సిగ్గుపడాలన్నారు.

మడకశిర : ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో జగన్ రెడ్డి ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలిందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి అన్నారు. మంగళవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ బాలాజీ నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడుని ఇబ్బంది పెట్టాలని చూస్తున్న జగన్ రెడ్డికి సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిదని అన్నారు.




సమావేశంలో పాల్గొన్న నాయకులు

మహాత్మాగాంధీని ఆదర్శంగా తీసుకుందాం



హిందూపురంలో జాతిపితకు నివాళి అర్పిస్తున్న నాయకులు



గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న రఘువీరారెడ్డి, తదితర నాయకులు

హిందూపురం :జాతిపిత మహాత్మా గాంధీని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని వైసిపి ఇన్‌చార్జ్ దీపిక, కాంగ్రెస్ నాయకులు బాలాజి మనోహర్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో దీపిక, మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో ఉమున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మేన్ బలరామిరెడ్డి, కమిషనర్ ప్రమోద్ కుమార్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు, టిడిపి కౌన్సిలర్లు గాంధీ చిత్రపటానికి, విగ్రహానికి పూల మాలలు వేసి నివాళు లు అర్పించారు. అదే విధంగా గాంధీ సర్కిల్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు బాలాజీమనోహర్‌తో పాటు పలువురు నాయకులు, ఆర్య వైశ్య సంఘం ఆద్వర్యంలో నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులతో పాటు ఆర్య వైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక బాలురు ఉన్నత పాఠశాలలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు రహిమాన్ మాట్లాడుతూ అహింసావాదంతో ఎంతటి లక్ష్యాన్ని అయినా సాధించవచ్చు అని తెలిపిన గొప్ప వ్యక్తి మహాత్మా గాంధీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రశాంత్ కుమార్, తల్లం మల్లికార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. పార్టీ నాయకులు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సిద్దయ్య, పట్టణ అధ్యక్షులు రవిశంకర్, జిల్లా యాదవ సాధికార అధ్యక్షులు కేశవయ్య, రాష్ట్ర మైనారిటీ అధికార ప్రతినిధి హుజురుల్లా ఖాన్, జిల్లా తెలుగుయువత అధికార ప్రతినిధి జావిద్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ కార్యాలయంలో మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవ నాయుడు, మాజీ జడ్పీటీసీ వెంకట రమణ, గుట్టూరు మాజీ సర్పంచి సూర్యనారాయణ, డివి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలను మాజీ ఎమ్మెల్యేగోనుగుంట్ల సూర్యనారాయణ అనుచరులు జరుపుకున్నారు. మంగళవారం గోనుగుంట్ల వ్యక్తిగత కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో గోనుగుంట్ల అనుచరులు డిష్ రాజు, దుస్సాక్రిష్ణ, రాప్తాటిరాము, నారాయణస్వామియాదవ్, బం డగహరి, నబీరసూల్, గంథమనేని నారాయణస్వామి, సరితాలదస్తగిరి, కట్టుబడి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జాతిపిత గాంధీకి నివాళు లర్పించారు, ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాయలసీమ జోనల్ అధ్యక్షులు వంకదారి వెంకటేశు, ఆర్యవైశ్య సంఘం మండల యువజన నాయకులు మహేష్ బాబు, రైస్ మిల్ సూరి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలోని మారుతినగర్ 17వ వార్డులో కౌన్సిలర్ సుభద్ర నాగేంద్ర ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. గాంధీ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

మడకశిర : జాతిపిత మహాత్మా గాంధీ అడుగుజాడల్లో మనమందరం నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిడబ్ల్యూసి మెంబర్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి తెలిపారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని కోల్డ్ స్టోరేజ్ లో జాతిపిత గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్, కన్వీనర్లు మంజునాథ్, బాబు, నాగరాజు, గురుమూర్తి, లోకేష్, గౌడప్ప, త్యాగరాజు, భయపరెడ్డి, చంద్రశేఖర్, బసవరాజు, నరసయ్య, జగన్నాథ్, గంగారాం, గవి రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ :గాంధీ వర్ధంతిని జనసేన పార్టీ నాయకులు మంగళవారం నిర్వహించారు. కదిరి జనసేన పార్టీ కార్యాలయంలో ఇంచార్జ్ భైరవ ప్రసాద్ తదితరులు గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు చలపతి, నల్లచెరువు మండల కన్వనర్ రవికుమార్, టౌన్ ఉపాధ్యక్షులు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శులు కిన్నెర మహేష్, అంజిబాబు, గుంత ప్రతాప్, రామచంద్ర, కార్యదర్శులు చెక్క రమణ, వంశీ, కృష్ణకాంత్, గోపాల్, రాము, అంకాలప్ప, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

అగళి : టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆపార్టీ మడకశిర నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో జయహో బిసి సదస్సును మంగళశారం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ బీసీల అభివద్ధి కేవలం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని తెలిపారు. బిసిలంతా ఏకమై టిడిపికి పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు టిడిపిలో చేరారు. జంగమరనపల్లి ముద్దగిరియప్ప, కరిదాసనపల్లి జవరప్ప, ఇరిగేపల్లి నాగరాజు తరపున 50 కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ కుమారస్వామి, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు రంగయ్య, జడ్పీటీసీ ఉమేష్, నియోజకవర్గ డాక్టర్ సెల్ అధ్యక్షులు కొంకల్లు కృష్ణమూర్తి, దాసిరెడ్డి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

కదిరి అర్బన్ : శాంతి భద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటానని పట్టణ సిఐ పుల్లయ్య తెలిపారు. మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ కర్నూల్ నుంచి సాధారణ బదిలీ పై కదిరికి వచ్చినట్లు ఆయన తెలిపారు. పట్టణంలోని ప్రజలు అన్ని రాజకీయ పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

గోరంట్ల రూరల్ : మండలంలోని గడ్డం తండాకు చెందిన వైసిపి యువ నాయకులు శివ నాయక్ సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి ఉషశ్రీ చరణ్ భర్త చరణ్ రెడ్డి మంగళవారం గడ్డం తాండకు చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వాసుదేవ్ నాయక్, గంపల రమణారెడ్డి, నర్సింపల్లి శివారెడ్డి, తిప్పానాయక్, సీనా నాయక్, జయచంద్ర నాయక్, బాలాజీ నాయక్, వరుణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన వైసిపి సమన్వయకర్త

మడకశిర : నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఈర లక్కప్ప మంగళవారం సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా నియోజకవర్గ సమన్వయకర్తగా ఎన్నికైన ఆయన ఇటీవల వరుస సమావేశాలు ఏర్పాటు చేసిన అనంతరం సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు.

అక్షరాస్యతపై అవగాహన

పెనుకొండ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు నగర పంచాయతీ పరిధిలోని కోనాపురం గ్రామంలో మంగళవారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ప్రతి ఇంటికి తిరిగి అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం గ్రామస్తులు మారుతి, పిఒ శంకర్ నాయక్, నరసింహమూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

హిందూపురం : బాలయేసు కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 6వ రోజు మంగళవారం కొత్త కాపుల పల్లి గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్రోగ్రాం అధికారి హరీష్ పర్యవేక్షణలో ఓటు హక్కు, అక్షరాస్యత, ఎయిడ్స్ నివారణ, తల్లిపాల ఆవశ్యకత, బాల్య వివాహాల నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం గురించి వివరిస్తూ నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్. జియావుల్లా ఖాన్, అధ్యాపకులు శివరామ రెడ్డి, అశ్వర్థ నారాయణ, వాలంటీర్లు పాల్గొన్నారు.

జనసేన మండల కమిటీ ఏర్పాటు

ఓబుళదేవర చెరువు : జనసేన పార్టీ మండల కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు. 27 సభ్యులతో కూడిన కమిటీని పుట్టపర్తి నియోజకవర్గ నాయకులు పత్తి చంద్రశేఖర్, మండల అధ్యక్షులు మేకల ఈశ్వర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.

ఆర్టీసీ డిపో ఎదురుగా గేట్‌మీటింగ్

కదిరి టౌన్ : విశాఖపట్నం జిల్లా ఆర్టీసీ ప్రజా రవాణా అధికారి అవలంభిస్తున్న ఉద్యోగ వ్యతిరేక విధానాలకు నిరసనగా మంగళవారం కదిరి డిపో ఎదురుగా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ సభ్యులు రామకృష్ణ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు హరిమోహన్, ఎన్‌వి.రమణ, బైరిశెట్టి అశ్వర్థమయ్య, గంగన్న, ఓబులేసు, శ్రీధర్, రామచంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపితోనే గ్రామస్వరాజ్యపాలన

గోరంట్ల రూరల్ : గ్రామ స్వరాజ్య పాలన వైసిపి ప్రభుత్వ హయాంలోనే సాధ్యమని మంత్రి ఉష శ్రీ చరణ్ భర్త చరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పుట్టగొండ్లపల్లి పంచాయతీ లోని బూచేపల్లి, కొత్తపల్లి, ఎస్సీ కాలనీ, గుంతపల్లి, పుట్టగుండ్ల పల్లి గ్రామాలలో పార్లమెంట్ ఇన్‌ఛార్జి శాంతతో కలిసి పర్యటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నర్సిరెడ్డి, ఎంపీటీసీ ఓబుల్ రెడ్డి, గంపల రమణారెడ్డి, పాటూరి శంకర్ రెడ్డి, నార్సింపల్లి శివారెడ్డి, హరినాథ్ రెడ్డి, అగ్రి చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ నాగభూషణ్ రెడ్డి, జెడ్పీటీసీ జయరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల మీట్

గోరంట్ల : పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిచన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. ఎంపిపి ప్రమీల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 22 మందికి కాను 10 మంది ఎంపిటిసిలు మాత్రమే హాజరయ్యారు. సమస్యలపై సభ్యులు ప్రశ్నించకపోవడంతో అధికారులు సమావేశాన్ని తూతూ మంత్రంగా ముగించారు. ఆయా శాఖల అధికారులు నామాత్రంగా వారి శాఖల పనితీరును వివరించారు. ఈసమావేశంలో ఎంపీడీవో రఘునాథ్‌గుప్త, వైస్ ఎంపీపీ రామలక్ష్మమ్మ, ఎంపీటీసీలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

రొద్దం : మండలంలోని రెడ్డి పల్లిలో కొంతకాలంగా నెలకొన్న తాగునీటి సమస్యను సర్పంచి రామాంజి పరిష్కరించారు. గ్రామ సమీపంలో దాదాపు కిలోమీటర్ దూరంలో 450 అడుగుల లోతువరకు బోరు వేయించి అక్కడ నుంచి గ్రామం లోకి పైపు లైన్ ఏర్పాటు చేయించారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య నెలకొనకుండా ముందస్తుగా చర్యలు చేపడుతుండటంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ధర్మవరం విద్యార్థులు

ధర్మవరం టౌన్ : నియోజకవర్గంలోని బత్తలపల్లి జడ్పీహెచ్‌ఎస్ స్కూల్లో ఈనెల 27, 28 వ తేదీలలో జరిగిన పోటీల్లో పాల్గొన్న ధర్మవరం యశోద కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ పథ్వీరాజ్, ప్రిన్సిపాల్ అనూప్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9వ తరగతి హేమశ్రీ, వర్షిత, ఎనిమిదవ తరగతి మిథిలా, దాత్రి రాష్ట్రస్థాయి త్రో బాల్ పోటీలకు ఎంపికవడం గర్వంగా ఉందన్నారు. అదే విధంగా సీనియర్ విభాగంలో జరిగిన త్రోబాల్ పోటీలలో అనంతపురం జట్టు తరపున ఆడిన 9వ తరగతి తన్మయశ్రీ, 8వ తరగతి కార్తీక్ తృతీయ స్థానంలో నిలిచారన్నారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

'అధికార' బదిలీ..!

కదిరి సిఐ బదిలీపై విమర్శలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పోలీస్ వ్యవస్థ అంటే సామాన్య ప్రజలు ఒకింత భయం వ్యక్తం చేశారు. సమస్యలను పోలీస్ అధికారులు వింటారా అనే పరిస్థితి సహజంగా సామాన్యుడి మదిలో ఉంటుంది. అయితే అందరు పోలీసులు అలా ఉండరు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కూడా కృషి చేసే వారుంటారు. అలాంటి వారికి ప్రజల నుంచి మంచి గుర్తింపు లభిస్తుంది. నెల రోజుల క్రితం కదిరి పట్టణ సిఐగా నారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి కదిరిలో అసాంఘిక శక్తుల ఆటకట్టించి శాంతిభద్రతలను నెలకొల్పేందుకు ఈ నెల రోజుల్లో ఆయన కృషి చేశారు. ఫ్రెండ్లీ పోలీసు విధానంతో ప్రజలతో మంచి సంబంధాలు ఏర్పరుచుకున్నారు. సమస్యలు చెప్పుకునేందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారిని ఆత్మీయంగా పలకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకుని సత్వరమే పరిష్కరించే విధంగా చొరవ తీసుకునేవారు. ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తూ దుండగుల ఆట కట్టించడంలో విశేష కృషి చేశారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా అందరికీ ఒకే న్యాయం అనేలా వ్యవహరించి అతి తక్కువ కాలంలోనే ఆయన ప్రజలు మన్ననలు పొందారు. ముక్కుసూటిగా వ్యవహరించే ఈయన విధానం నచ్చని కొందరు ఆయన్ను కదిరి నుంచి పంపే ప్రయత్నాలు చేశారు. సదరు సిఐ ఉంటే తమ ఆటలు సాగవని భావించిన కొందరు ఆయనపై అధికార పెత్తనం ప్రదర్శించారు. అందులో భాగంగా అధికార బలంతో ఆయన్ను బదిలీ చేశారు. సిఐ బదిలీపై పట్టణంలో సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ఏకపక్షంగా వ్యవహరించడన్న సాకుతోనే ఆయన్ను కదిరి నుంచి పంపించేశారని ప్రజలు భావిస్తున్నారు.